గ్రామాల్లో మినీ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం

- నిరుపయోగంగా కమ్యూనిటీ హాళ్లు
- కాసులపల్లిలో మొదలైన పనులు
- ఫంక్షన్ హాల్ పూర్తయితే అందరికీ సౌకర్యం



కొనసాగుతున్న మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు

పెద్దపల్లిరూరల్: పెళ్లిళ్లు, పుట్టిన రోజు వేడుకలు, ఇతర ఏ శుభకార్యాలు చేయాలన్నా.. మనకు అనువైన స్థలం ఉండాలి. ప్రస్తుతం పట్టణీకరణ పెరిగి చాలా ఇండ్లు నిర్మించుకోవడంతో స్థలం దొరకడం లేదు. గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటోంది. ఇరుకు ఇళ్లల్లో శుభకార్యాలు చేయడం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఏ శుభ కార్యక్రమం చేద్దామన్నా ఇంట్లో సరిపోయే స్థలం లేకపోవడంతో అందరూ ఫంక్షన్‌హాళ్ల వైపు చూస్తున్నారు. ఫంక్షన్ హాళ్లలో అన్ని రకాల సౌకర్యాలు ఉండి, సకల సదుపాయాలతో ఉంటున్నాయి. దీంతో ప్రజలు అన్ని రకాల శుభ కార్యాలను ఫంక్షన్ హాళ్లలో చేస్తున్నారు. పట్టణాల్లోనైతే ఫంక్షన్ హాళ్లకు కొదవ లేదు.. మరి గ్రామాల్లో ఎలా..! ఇంతకాలం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు కులాలవారీగా కమ్యూనిటీ హాళ్లను మంజూరు చేశారు. ప్రజాధనంతో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లు ఇప్పటికీ అంతటా నిరుపయోగంగానే కనిపిస్తున్నాయి. కేవలం అప్పుడప్పుడు సభలు, సమావేశాలకు మాత్రమే పనికొస్తున్నాయి. చాలా సందర్భాలు తాళం వేసి నిరుపయోగంగా ఉంటున్నాయి. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సొంతగ్రామం కాసుపల్లి ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు నిధులు కేటాయించారు. అయితే కమ్యూనిటీ హాల్ నిర్మించడం కంటే .. మినీ ఫంక్షన్ హాల్ నిర్మిస్తే మాకు మేలు కలుగుతుందంటూ కాలనీ వాసులు, గ్రామ సర్పంచ్ దాసరి పద్మ, అప్పన్నపేట సొసైటీ విండో చైర్మన్ దాసరి చంద్రారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి దాదాపు రూ.30 లక్షల నిధులు అవసరమవుతాయని వివరించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి సమ్మతించారు. దీంతో మినీ ఫంక్షన్‌హాలు నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. ఈ మినీ ఫంక్షన్‌హాల్ అందుబాటులోకి వస్తే స్థానికులకు శుభకార్యాలు జరుపుకోవడం ఎంతో సులువుగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో సౌలభ్యంగా ఉంటుంది



కాసుపల్లిలోని ఎస్సీ కాలనీలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టడం చాలా సంతోషం. ఈ మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. ఏ కార్యక్రమమైనా నిర్వహించుకునేందుకు అనువుగా ఉంటుంది.

– గద్దల శేఖర్, కాసులపల్లి

ప్రజలందరికీ ఉపయోగకరం



కాసులపల్లిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే కమ్యూనిటీహాల్‌కు బదులు మినీ ఫంక్షన్‌హాల్ నిర్మించాలని ఎమ్మెల్యేను విన్నవించాం. అందుకు సానుకూలంగా స్పందించి మరిన్ని నిధులు మంజూరుకు హామీ ఇవ్వడంతో పనులు చేపట్టాం. మినీ ఫంక్షన్ హాల్ ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

–దాసరి పద్మ, సర్పంచ్ కాసులపల్లి

క్లుప్తంగా

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని పెండింగ్ లో ఉన్న జీతాలు, బిల్లులను వెంటనే చెల్లించాలంటూ శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సప్లమెంటరీ వేతనాలు, పీఆర్సీ, డీఏ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సెలవు వేతనాలను చెల్లించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుర్రశ్యాం, పోచయ్య, లక్ష్మణ్, రాంకిషన్‌రావు, సంతోష్‌రెడ్డి, రాజన్న, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న ట్రస్ట్ చైర్ పర్సన్ స్నేహలత

ధర్మారం: సంపూర్ణమైన ఆరోగ్యం కలిగి ఉన్నవారే నిజమైన ధనవంతులను ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎల్‌ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్ పర్సన్ కొప్పుల స్నేహలత కోరారు. ధర్మారం మండలం రచ్చపల్లిలో శుక్రవారం ఎల్‌ఎం ట్రస్టు ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్‌ను స్నేహలత ప్రారంభించారు. క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోర సుధాకర్, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ బెల్లాల రోజారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు 52శాతం రిజర్వేషన్లు కల్పించాలి



రిలే దీక్షలో పాల్గొన్న సుదర్శన్, మహిళలు

పెద్దపల్లిరూరల్: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తూ తీర్మానాలను ఆమోదించాలని దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్ డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ దాసరి ఉష ఆధ్వర్యంలో పెద్దపల్లి బస్టాండ్ వద్ద 58 రోజులుగా చేస్తున్న రిలేదీక్ష శిబిరాన్ని శుక్రవారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. జనాభాప్రాతిపదికన బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలన్నారు. దీక్షలో నాయకులు శేషాద్రి, సవిత, అరుణ, సాధిక్, శ్రీధర్, పాల్గొన్నారు.

తై బజార్ రద్దు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న వ్యాపారులు

సుల్తానాబాద్: మున్సిపల్ అధికారులు తైబజార్‌ను రద్దు చేయాలని వర్తక సంఘం పట్టణ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చేపూరి రవీందర్ గౌడ్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తైబజార్ వసూలు చేసే ఉద్దేశం ఉంటే ఒక వాహనానికి 24 గంటలు రసీదు పని చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గూడ్స్ వాహనాలకు తైబజార్ తీసుకోవద్దని కోరారు.కార్యక్రమంలో కోశాధికారి కొమురవెల్లి సత్యం సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ట్రినిటీలో హెల్త్,ఫిట్‌నెస్‌పై అవగాహన

పెద్దపల్లిరూరల్: ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవడం తో పాటు వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండగలుగుతారని ఫిట్‌నెస్ ట్రైనర్ శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, లయన్స్‌క్లబ్ ఆఫ్ స్త్రీశక్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అవేర్‌నెస్ ఆన్ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ అనే అంశంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, స్త్రీశక్తి అధ్యక్షుడు రజితపవిత్రన్, తదితరులున్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన 'మోడీ' సర్కార్

- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. పెద్దపల్లిలోని కమాన్‌వద్ద పార్టీ శ్రేణులతో కలసి రాజీవ్‌రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు సురేశ్‌గౌడ్, అన్నయ్యగౌడ్, మినుపాల ప్రకాశ్‌రావు, మల్లయ్య, మస్రత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజా సమస్యలు తీరుతాయి

ఎలిగేడు: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి వస్తేనే పేదలు, బడుగు, బలహీనవర్గాలు, రైతులు అన్ని వర్గాల ప్రజల సమస్యలు తీరుతాయని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. శుక్రవారం రాత్రి ఎలిగేడు మండలంలోని లోకపేటలో హాథ్ సే హాథ్ జోడో చేపట్టారు. గ్రామంలో ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, ప్రకాష్‌రావు, నరేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

జూలపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు ఇస్తూ నిరుపేదలను మోసం చేస్తున్నాయని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణరావు ఆరోపించారు. శుక్రవారం మండలంలోని కీచులాటపల్లెలో హత్ సే హత్ జోడో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మెతుకు కాంతయ్య,ఆవుల మల్లేశ్,బండి స్వామి, కొమ్మ పోచాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం

మంథని: రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మంథనిలో కాంగ్రెస్ నాయకులు ప్రధాన చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రజాసామ్యాన్ని ఖూనీ చేసే విధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. వెంటనే లోకసభ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, పట్టణ అధ్యక్షుడు పోలు శివ, నాయకులు ఓడ్నాల శ్రీనివాస్,జంజర్ల శేఖర్, బండారి ప్రసాద్, తదితరులు ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక తెలంగా చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, దేవనపల్లి చక్రపాణి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలి

- ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: బీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాయిరాం గార్డెన్‌లో పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో పాటు రైతులు, ప్రజలు మహిళలకు చేపట్టిన పథకాలను వివరించాల్సిన అవసరం ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ నాయకులపై ఉందన్నారు. కొందరు పనికిమాలిన విమర్శలు చేస్తున్నారని అవి పట్టించుకోవాల్సిన అవసరం లేదని ప్రజలకు అండగా ఉండేది ఈ ప్రభుత్వం మేనని ప్రజలకు తెలుసు అన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు అధ్యక్షుడు కాసర్ల ఆనంతరెడ్డి,ఎంపీపీ బాలాజీ రావు, మండల అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్ రావు, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రాజమల్లయ్య,కన్వీనర్లు లంక దాసరి రవి, దీకొండ భూమేశ్, ఎంపీటీసీ ల ఫోరం అధ్యక్షుడు ఫక్కీర్ యాదవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిశివారులోని బందంపల్లిలో శుక్రవారం బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి మెడికల్ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ విపక్షపార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, రాకేశ్‌కుమార్, నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు శుక్రవారం ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, శారీరక, మానసిక ఎదుగుదలకు రాగి లడ్డు, రాగి జావ, ఆయూస్ కిట్లను విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అన్నారు. వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, మెడికల్ ఆఫీసర్ శ్రావణి, ప్రిన్సి పాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో కుటుంబానికి అండగా నిలవాలి

రామగిరి: వృత్తి, ఉపాధి శిక్షణలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా కుటుంబానికి అండగా నిలవాలని ఆర్జీ– 3 సేవా సమితి అధ్యక్షురాలు తన్నీరు శ్రీదేవి అన్నారు. శుక్రవారం రత్నాపూర్‌లోని రైతువేదికలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు, మగ్గం శిక్షణ కేంద్రాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. సింగరేణి సంస్థ ప్రభావిత గ్రామాల అభివృద్ధిలో భాగంగా స్వయం ఉపాధి పథకాలకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ డీజీఎం విలాస్ శ్రీనివాస్ పొద్దార్, డీవైపీఎం కావూరి మారుతి, సెక్రటరీ పెండ్లి రమ్య, కుట్టు, మగ్గం శిక్షకులు పాయిల పద్మ, ఎండీ. ఆస్మా బేగం , కోఆర్డినేటర్ రాంశెట్టి లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టీఎల్‌ఎం మేళాకు ఉపాధ్యాయుల ఎంపిక

రామగిరి: మండలంలోని వెంకట్రావ్‌పల్లి, రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పోలు స్వామి, సలాకుల తిరుపతి రాష్ట్రస్థాయి టీఎల్‌ఎం మేళాకు ఎంపికై నట్లు మండల విద్యాధికారి పల్లెపాటి సంపత్ రావు తెలిపారు. శుక్రవారం గర్రెపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి టీఎల్‌ఎం మేళాలో స్వామి తెలుగులో మొదటి బహుమతి, తిరుపతి పరిసరాల విజ్ఞానంలో రెండవ బహుమతి గెలుపొంది రాష్ట్రస్థాయి టీఎల్‌ఎం మేళాకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి, తిరుపతిని ఎంఈవో సంపత్ రావు, నోడల్ అధికారి బి.సదయ్య,తదితరులు అభినందించారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసు సీబీఐకి అప్పగించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

సుల్తానాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసును సీబీఐకి అప్పగించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మన్‌ను వెంటనే అరెస్టు చేసి,పేపర్ లీకేజీకి బాధ్యులైన వారందరి పైన సీబీఐ చేత దర్యాప్తు చేసి చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్ మాట్లాడుతూ పేపర్ లీక్ చేసిన బాధ్యులపై చర్యలు తీసుకునేంతవరకు బీఎస్పీ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోయిని రంజిత్, అసెంబ్లీ మహిళా కన్వీనర్ కల్వల శోభ, పట్టణ అధ్యక్షుడు తోట మధు పటేల్, మండల ఉపాధ్యక్షుడు అల్లెపు చంద్రశేఖర్, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి గోస తీర్చాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న పుట్నూర్ మహిళలు

పాలకుర్తి: 'బావుల్లో నీళ్లు లేవు, నల్లా నీళ్లు సరిగ్గా రావడం లేదు. తాగునీటికి గోసపడుతున్నాం మాకు నీటి సౌకర్యం కల్పించాలి' అని పాలకుర్తి మండలం పుట్నూర్ మహిళలు ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు విన్నవించారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మహిళలు కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యను విన్నవించయారు.. పుట్నూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో ఉన్న తమ కాలనీకి నాలుగు రోజులకొకసారి కూడా నీళ్లు రావడం లేదని, పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదని మహిళలు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సర్పంచ్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఆయుష్ వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

ఓదెల: ఆయుష్ వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని ఓదెల ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ కమలా కుమారి అన్నారు. శుక్రవారం ఓదెల కస్తూర్బా బాలికల పాఠశాలలో జాతీయ పోషణ పక్ష దినోత్సవంలో భాగంగా విద్యార్థినులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఆయుర్వేద వైద్యంతో తయారుచేసిన రాగిజావ ముద్దలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆకుల మహేందర్, ఎస్‌వో మాధవి, ఫార్మాసిస్టు లక్ష్మణ్, సూపర్‌వైజర్ ఉమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ భూమి కేటాయించాలి

జ్యోతినగర్: పేదలకు ప్రభుత్వ భూమిని కేటాయించేవరకు భూ పోరాటం ఆగదని ఎన్టీపీసీ రామగుండం ఏరియా కార్యదర్శి ఎం.రామాచారి అన్నారు. శుక్రవారం రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. పేదలు నివాస స్థలాలు కోరితే వారికి నిల్వ లేకుండా చేస్తారా అని ప్రశ్నించారు. సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కార్యదర్శి ఎం రామాచారి మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం సీపీఎం చేపట్టిన భూ పోరాటం ఆరో రోజుకు చేరుకుందన్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సింది పోయి పోలీసులతో టెంట్ తొలగించడం సరికాన్నారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేంత వరకు భూ పోరాటం ఆగదని వెల్లడించారు. నేడు గోదావరిఖనిలో జరుగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

విద్యార్థినికి పలువురి అభినందన

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం చందనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని డి హర్షితను గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్ శుక్రవారం అభినందించారు. గతేడాది ఆగస్టు నెలలో ఢిల్లీలో నిర్వహించిన 9వ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డు పోటీల్లో ఎంపిక చేసిన అత్యుత్తమ 60 ప్రదర్శనలో హర్షిత తయారు చేసిన బహుళ ప్రయోజకార శిరాస్త్రం అనే ప్రాజెక్ట్ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఏప్రిల్ 10 నుంచి రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే వైజ్ఞానిక సదస్సులో పాల్గొనేందుకు హర్షిత, గైడ్ టీచర్ సంపత్ కుమార్ ఆహ్వాన పత్రాన్ని అందుకున్నారు. ఈ మేరకు పాఠశాలలో అభినందన సభలో యూత్ ఫర్ సేవ నిర్వాహకులు రజిత, టూటౌన్ సీఐ వేణుగోపాల్ హర్షితకు రూ.6500 ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్యామ్ పటేల్, హెచ్‌ఎం శ్రీనివాస్, విద్యాకమిటీ చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలిగేడులో 'సాక్షి' వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న అభిమానులు, పాఠకులు

ఎలిగేడు: మండల కేంద్రంలో సాక్షి దినపత్రిక 15వ వార్షికోత్సవాన్ని శుక్రవారం సాక్షి దినపత్రిక పాఠకులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా బస్టాండ్ ఆవరణలో కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజల మన్ననలు పొందారు. కార్యక్రమంలో తాటిపల్లి సతీష్‌బాబు, మామిడాల రమేశ్, కవ్వంపల్లి చంద్రయ్య, నారాయణ, మోహన్‌రెడ్డి, శివకృష్ణ, సాయితేజ, అనిల్, తిరుపతిరెడ్డి, రమేశ్ సాక్షి పాఠకులు,అభిమానులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రామగుండం: గ్రామ పంచాయితీ పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని బీజేపీ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు గుండబోయిన లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రామగుండం ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా మానసిక వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చ కార్పొరేషన్ అధ్యక్షులు డబ్బెట కమలాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోష్క రమేశ్, చిలుముల సాగర్, కాపరపు రాయలింగు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలపై వినతి

ఎలిగేడు: పంచాయతీ కార్మికులకు సకాలంలో జీతాలను చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాసమూర్తికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, దళితబంధులలో పారిశుధ్య కార్మికులకు ప్రాధన్యత ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి ప్రభాకర్, బీజేపీ మండల అధ్యక్షుడు మామిడాల రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

పెద్దపల్లిరూరల్: పంచాయతీల్లో పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ దళితమోర్చా మండల అధ్యక్షుడు పల్లె సదానందం డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి ఎంపీడీవో ఆఫీస్ ఎదుట ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఐదారు నెలలుగా వేతనాలు అందడం లేదని, కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. జీవో 60 ప్రకారం వేతనాలను చెల్లించాలని కోరారు. పారిశుధ్య పనులు చేసే దళితులకు దళితబంధు వర్తింపజేయాలన్నారు. నాయకులు జంగ చక్రధర్‌రెడ్డి, క్రాంతి, విశ్వర్‌రావు, సురేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయవ్యాధి నివారణ



జూలపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ,ఎంపీడీవో

జూలపల్లి: క్షయవ్యాధి నివారణకు ప్రజలందరూ చైతన్యం కావాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీపీ రమాదేవి, ఎంపీడీవో వేణుగోపాలరావుతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రంగారెడ్డి,ఉపాధ్యక్షుడు రమేశ్,ఎంపీవో కిరణ్, సర్పంచులు, కార్యదర్శులు ఉన్నారు.

ధర్మారం: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అనుదీప్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, మండల విద్యాధికారి ఛాయాదేవి,వైద్యాధికారి అనుదీప్, హెచ్‌ఈవో రాజారెడ్డి పాల్గొన్నారు.

పాలకుర్తి: బసంత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం టీబీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి వైద్యురాలు హరితభవాని, సిబ్బంది రజీవ్‌కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో టీబీ (క్షయ) వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులకు సన్మానం



సర్పంచ్, కార్యదర్శిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే



సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు

సుల్తానాబాద్‌రూరల్/కమాన్‌పూర్/కాల్వశ్రీరాంపూర్/ ఓదెల/జూలపల్లి/రామగిరి /పాలకుర్తి/మంథని: జాతీయ పంచాయతీ అవార్డులకు ఎంపికైన గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, కార్యదర్శులను మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోలు, ఎంపీపీలు, నాయకులు సన్మానించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు, సర్పంచులు,ఎంపీటీసీలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.